క్లుప్తంగా

వనరుల సద్వినియోగంతో అభివృద్ధి

ట్రైనీ కలెక్టర్ నోఖ్వాల్



జి.కొండూరు: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకోగలిగితే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ట్రైనీ కలెక్టర్ శుభం నోఖ్వాల్ అన్నారు. జి.కొండూరు కమ్యూనిటీహాల్‌లో సర్పంచ్‌లు, మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బందికి గురువారం నిర్వహించిన సుస్థిరాభివృద్ధి శిక్షణా తరగతులకు ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, ట్రైనీ కలెక్టర్ శుభం నోఖ్వాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎంపీడీఓ బీవీ రామకృష్ణ నాయక్ కోర్సు డైరెక్టర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

పైడిమర్రి జయంతి నిర్వహించాలని వినతి



తిరువూరు: విద్యార్థుల్లో దేశభక్తి, సోదర భావం పెంపొందించేందుకు భారతదేశం నా మాతృభూమి ప్రతిజ్ఞ రాసిన పైడిమర్రి వెంకట సుబ్బారావు జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అన్ని పాఠశాలల్లో విధిగా నిర్వహించాలని ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు రాంప్రదీప్ ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ కృష్ణారెడ్డిని కోరారు. గురువారం విజయవాడలో ఆంగ్ల నిఘంటువుల తయారీపై ఉపాధ్యాయులకు నిర్వహించిన వర్క్‌షాపులో పాల్గొన్న రాంప్రదీప్ ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.

అనుమతి లేని ఎరువుల విక్రయాలు నిలుపుదల



తిరువూరు: తిరువూరు పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో ధ్రువీకరణ లేకుండా విక్రయిస్తున్న ఎరువులు, పురుగు మందుల అమ్మకాలను గురువారం వ్యవసాయాధికారులు నిలిపివేశారు. వ్యవసాయ శాఖ గుంటూరు సహాయ సంచాలకులు ప్రేమ్‌శేఖర్, వ్యవసాయాధికారి సురేష్‌బాబు తిరువూరులోని ఎరువుల దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. రూ.58,418 విలువైన 6.35 టన్నుల ఎరువులకు రిటైల్ అమ్మకాల ధ్రువీకరణ లేనట్లు గుర్తించారు. బయో స్టిమ్యులెంట్స్ రూ.5.51 లక్షల విలువైన 171.2 లీటర్లను కూడా విక్రయించవద్దని ఆదేశించారు. వెంటనే ఆయా ధ్రువీకరణ పత్రాలను వ్యవసాయ శాఖకు సమర్పించకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన తప్పనిసరి

చాట్రాయి: మొక్కజొన్న సాగుకు ఆశించే తెగుళ్ల నివారణపై రైతులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ అధికారి బి.శివశంకర్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మొక్క జొన్న సాగును గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మొక్కజొన్న పైరుకు కత్తెర పురుగు ఆశించే అవకాశం ఉన్నందున దీనిని గుర్తించడానికి తలపై తిరగేసిన వై ఆకారంలో చివరన నాలుగు చుక్కలు ఉన్నట్లుగా ఉంటుందని, దీని నివారణకు ఐదు శాతం ఎస్‌జీ 0.5 కిలో గ్రాము ఇమామెక్టిన్ బెంజోయేట్ ఒక లీటరు నీటిలో కలిపి ఎకరాకు పిచికారీ చేయాలని, లేదా 80 గ్రాముల లేవా స్పైనో శాడ్ స్పైనో టోరమ్‌ను కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. ఆరబెట్టిన వరి ధాన్యాన్ని భద్రపరచు కోవాలని ఆయన సూచించారు.

పట్టాలు ఇవ్వాలి

చాట్రాయి: సాగు చేసుకుంటున్న ఫారెస్టు భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యవర్గ సభ్యుడు చాట్ల బాబూరావు కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని చిత్తపూరు ఫారెస్టులో ఎన్నో ఏళ్లుగా 300 మంది పేద రైతులు అటవీ భూములను సాగు చేసుకుంటున్నారని, వారి సమస్యల పరిష్కారానికి అర్జీలు ఇవ్వడానికి ఆరుగొలనుపేట వస్తే తుఫాన్ కారణంగా రద్దు చేశారని, తిరిగి మళ్లీ ఎప్పుడు సభ నిర్వహిస్తారో తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తిరువూరు: స్థానిక ఫ్యాక్టరీ సెంటర్లో నివసించే సయ్యద్ అహ్మద్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కుమారులకు స్కూల్ ఫీజు చెల్లించలేక ఇబ్బంది పడుతున్న ఆయన భార్య పీర్‌బీకి హైదరాబాద్‌కు చెందిన అబిదా ఖాతూన్ ఏడాదికి అవసరమైన స్కూల్ ఫీజు చెల్లించి చేయూత నందించారు. పేదరికం చదువుకు అడ్డు కాకూడదనే ఉద్దేశంతో తాను అహ్మద్ కుటుంబానికి అవసరమైన ఆర్థికసాయం అందించానని ఖాతూన్ తెలిపారు.

ఆయాల ఆకలి కేకలు

- ఐదు నెలలుగా వేతనాలు రాని వైనం
- ఆర్థిక ఇబ్బందులతో సతమతం
- అప్పుల పాలై అవస్థలు పడుతున్న కుటుంబాలు



నూజివీడు జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌లో బాత్‌రూమ్‌ల వద్ద శుభ్రం చేస్తున్న ఆయా

నూజివీడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉన్నన్నాళ్లు పాఠశాలల్లో పనిచేసే ఆయా (స్వీపర్)లకు వేతనాన్ని రెండు నెలలకొకసారి క్రమం తప్పకుండా చెల్లించేవారు. ఐదేళ్లలో ఏనాడు కూడా వారి వేతనాలను చెల్లించడంలో జాప్యం జరుగలేదు. దీనికి భిన్నంగా ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం గద్దెనెక్కిన ఆరు నెలలకే వేతనాలను చెల్లించకుండా జాప్యం చేస్తోంది. దీంతో ఆయాలకు ఐదు నెలల వేతనాల బకాయిలు పేరుకుపోయాయి. పాఠశాలల్లో తరగతి గదులు ఊడ్చేందుకు బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు కడిగి ఊడ్చేందుకు నియమితులైన ఆయాలు ఆకలి కేకలు పెడుతున్నారు. ఐదు నెలల వేతన బకాయిల కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. వేతనాలు నెలల తరబడి రాకపోవడంతో కుటుంబ పోషణ కోసం అప్పులపాలవుతున్నారు. వడ్డీకి డబ్బులు తీసుకొని కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో వడ్డీల భారం పెరిగిపోతోందని ఆయాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గంట ముందే విధులకు..

ప్రభుత్వ పాఠశాలలను శుభ్రంగా ఉంచేందుకు గత ప్రభుత్వం ఆయాలను నియమించింది. వీరికి నెలకు రూ.6 వేల చొప్పున వేతనాన్ని అందజేస్తారు. వేసవి సెలవులు రెండు నెలలకు మాత్రం నెలకు రూ.3 వేలు చొప్పున వేతనాన్ని ప్రభుత్వం చెల్లిస్తుంది. ఉదయం పాఠశాల తెరవడానికి కన్నా గంట ముందు వచ్చి తరగతి గదులను, బాత్‌రూమ్‌లను, మరుగుదొడ్లను శుభ్రం చేస్తారు. సాయంత్రం పాఠశాల వదిలే వరకు పాఠశాలలోనే ఉంటారు. వీరికి వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుండటంతో కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నియోజకవర్గంలో పనిచేస్తున్న ఆయాలు	
మండలం	పనిచేస్తున్న ఆయాలు
నూజివీడు	94
చాట్రాయి	63
ముసునూరు	59
ఆగిరిపల్లి	55
మొత్తం	271

పచ్చడి మెతుకులతో సరి..

నేడు మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఆయిల్, పప్పులు, కోడిగుడ్లు, ఉల్లి, వెల్లుల్లి తదితర వస్తువుల ధరలు మరింత పెరిగాయి. వీటిని కొనాలంటే పేదలు, మధ్య తరగతి ప్రజలకు భారంగా మారింది. ఈ పరిస్థితుల్లో ఆయాలు వేతనాలు రాక, నిత్యావసర వస్తువులను కొనుగోలు చేయలేక పచ్చడి మెతుకులకే పరిమితమవుతున్నారు.



ఇళ్లల్లో పనులకు వెళ్తున్నా

ఐదు నెలల వేతనం రావాల్సి ఉంది. భర్త, నలుగురు పిల్లలతో జీవిస్తున్నా. వేతనాలు సకాలంలో రాకపోవడంతో కుటుంబ పోషణ కోసం ఇళ్లల్లో పనికి వెళ్తున్నా. పాఠశాల సాయంత్రం 4 గంటలకు వదిలిన తరువాత ఇళ్లల్లో పని చేసుకుంటూ వచ్చే డబ్బులతో కుటుంబ అవసరాలను కొంత మేరకు తీర్చుకుంటున్నా.

– మాపర్తి దుర్గ, జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్, నూజివీడు



ఐదు నెలల వేతన బకాయిలు రావాలి

తన భర్త ఒక్కడే కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవలే నేను ఆపరేషన్ చేయించుకుంటే రూ.2 లక్షలు ఖర్చయ్యింది. ఐదు నెలల వేతన బకాయిలు రావాలి. గత ప్రభుత్వంలో రెండు నెలలకొకసారి వేతనాలు అకౌంట్‌లో జమయ్యేవి. ఎప్పటి వేతనాలు అప్పుడే ఇస్తే మాలాంటి పేదలు ఇబ్బందులు పడకుండా ఉంటాం.

– తేళ్లూరి కృష్ణవేణి, ఎంపీపీ స్కూల్, చిన్నంపేట, చాట్రాయి మండలం



అప్పులు పెరిగిపోతున్నాయి

ఐదు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఇంట్లో అవసరాలు తీర్చుకునేందుకు కిరాణా షాపుల వద్ద బాకీలు పెరిగిపోతున్నాయి. వ్యాపారులకు డబ్బులు ఇవ్వకపోవడంతో ఇక అరువుపై సరుకులు ఇవ్వలేమని చెప్తున్నారు. అసలే నిత్యావసరాల ధరలు పెరిగి ఇబ్బందులు పడుతున్నాం. వేతనాలను వెంటనే చెల్లించాలి.

– పులపాక విజయకుమారి, ఎంపీపీ స్కూల్, తుమ్మగూడెం, చాట్రాయి మండలం

రైతుల నుంచి ధాన్యం సేకరించి మిల్లర్లకు పంపండి

విజయవాడ ఆర్డీఓ చైతన్య



రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ చైతన్య

మైలవరం: రైతుల నుంచి వెంటనే ధాన్యం సేకరించి ప్రభుత్వం గుర్తించిన రైస్ మిల్లులకు పంపాలని విజయవాడ రెవెన్యూ డివిజినల్ అధికారి కావూరి చైతన్య అధికారులకు సూచించారు. మైలవరం రహదారుల్లో రైతులు ఆరబెట్టుకున్న ధాన్యాన్ని ఆర్డీఓ చైతన్య గురువారం పరిశీలించారు. రైతుల ఇబ్బందులను గుర్తించి ఆర్డీఓ స్పందిస్తూ ఎండినంత వరకు ధాన్యం సేకరించి రైస్ మిల్లులకు పంపిస్తే అక్కడ ధాన్యం సురక్షితంగా ఉంటుందన్నారు. వాతావరణం ప్రతికూలంగా ఉందని, ఏ సమయంలోనైనా వర్షం పడే అవకాశం ఉన్నందున రైతులు ఇబ్బందులు పడకుండా తక్షణం చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, సివిల్ సప్లయిస్ అధికారులకు సూచించారు. రైతులతో ఆర్డీఓ నేరుగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతులు కూడా ధాన్యం సేకరణలో అధికారులకు సహకరించాలని సూచించారు. చంద్రగూడెం గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మమేకమయ్యారు. తహసీల్దార్ గడ్డం బాలకృష్ణారెడ్డి, రెవెన్యూ సిబ్బంది, సివిల్ సప్లయిస్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఖిల్లా ఔన్నత్యాన్ని భావితరాలకు చాటాలి

పురావస్తు శాఖ రాష్ట్ర కమిషనర్ వాణీమోహన్



కొండపల్లి ఖిల్లాపై మ్యూజియాన్ని సందర్శిస్తున్న వాణీమోహన్, కలెక్టర్ లక్ష్మీశ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): చారిత్రక ప్రాశస్త్యం కలిగిన కొండపల్లి ఖిల్లా ఔన్నత్యాన్ని భావితరాలకు చాటి చెప్పడంతో పాటు పర్యాటకులను ఆకర్షించేలా ఖిల్లాను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ జి.వాణీమోహన్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. కొండపల్లి ఖిల్లాను గురువారం వారు ఆకస్మికంగా పరిశీలించారు. ఖిల్లాపై మ్యూజియంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ఫొటోను యాప్ ద్వారా ఆండ్రాయిడ్ ఫోన్‌లో స్కాన్ చేసుకుని ఆ చిత్రం విశిష్టత తెలుసుకునేలా ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు. పురాతన కట్టడాలు పరిశీలించి వాటి విశిష్టతపై ఆరా తీశారు. నర్తనశాల, మార్కెట్ యార్డ్ అత్తాకోడళ్ల కోనేరును సందర్శించారు. పర్యాటకుల రాకపోకలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వాణీమోహన్ మాట్లాడుతూ దాదాపు 10వ శతబ్దం కాలం నుంచి స్వాతంత్ర్యం సిద్ధించే వరకు అనేక మంది రాజులు కొండపల్లి కోట నుంచి పరిపాలన సాగించారన్నారు. ప్రత్యేక రోజులలో హంగులు ఆర్భాటాలు ఖర్చు లేకుండా సహజసిద్ధమైన వాతావరణంలో శుభకార్యాలు నిర్వహించుకునేలా ప్రజలలో అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047లో విజన్ డాక్యుమెంట్‌లో పర్యాటక రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పర్యాటకులను ఆకర్షించే విధంగా ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు జరిపేలా ఆలోచన చేస్తున్నామన్నారు. టూరిజం శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ వై.వి.ప్రసన్నలక్ష్మి, జిల్లా టూరిజం అధికారి ఎ.శిల్ప, సహాయ టూరిజం అధికారి డి.గోపాల్, పురావస్తు శాఖ ఉపసంచాలకుడు ఓ.రామసుబ్బారెడ్డి, పి. సురేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



షేక్ యూనిస్‌పాషా



పిల్లా చరణ్

నూజివీడు: వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ విభాగాల్లో నూజివీడు పట్టణానికి చెందిన ఇద్దరు నాయకులకు పదవులు లభించాయి. ఈ మేరకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర కార్యాలయం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా షేక్ యూనిస్ పాషా (గబ్బర్), క్రిస్టియన్ మైనారిటీ సెల్ ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా పిల్లా చరణ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ పార్టీని మరింత పటిష్ట పరిచేందుకు కృషి చేస్తామన్నారు. తమకు పదవులు వచ్చేందుకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

700 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

చాట్రాయి: సారా తయారీ కేంద్రాలపై దాడి చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ ఎస్ఐ మస్తానరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోతనపల్లి గ్రామంలో సారా తయారీ కేంద్రంపై దాడి చేసి 700 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు దారావతు శ్రీనును అదుపులోకి తీసుకున్నారు.

22న మెగా జాబ్‌మేళా

ఇబ్రహీంపట్నం: వీహెచ్‌ఎస్ గ్రూప్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22న నిరుద్యోగులకు మెగా జాబ్ మేళా ఇబ్రహీంపట్నంలో నిర్వహిస్తామని హెచ్‌ఆర్ మేనేజర్ మహేష్ తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ జాబ్‌మేళా బ్రోచర్‌ను గురువారం ఆవిష్కరించారు. ముత్తవరపు కల్యాణ మండపంలో ఉదయం నుంచి జాబ్ మేళా జరుగుతుందన్నారు.

నేడు ట్రిపుల్ ఐటీలో..

ముసునూరు: మండలంలోని నిరుద్యోగులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి.రాణి తెలిపారు. శుక్రవారం ఉదయం తొమ్మిదిన్నర గంటల నుంచి నూజివీడు ట్రిపుల్ ఐటీ స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ ఆడిటోరియంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పదో తరగతి, ఇంటర్, డిప్లమో, బీటెక్, బీఫార్మసీ, ఏదైనా డిగ్రీ అర్హతలు కలిగిన నిరుద్యోగులు తమ విద్యార్హతల పత్రాలతో హాజరు కావాలని కోరారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



జంగాలపల్లిలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

జంగాలపల్లి(మైలవరం): గ్రామ ప్రజల సమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని విజయవాడ రెవెన్యూ డివిజినల్ అధికారి కావూరి చైతన్య అన్నారు. మైలవరం మండలం చంద్రగూడెం పంచాయతీ శివారు జంగాలపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు గురువారం జరిగింది. రైతుల నుంచి 26 అర్జీలను అధికారులు స్వీకరించారు. తహసీల్దారు గడ్డం బాలకృష్ణారెడ్డి, అటవీ శాఖాధికారులు, దేవదాయ శాఖ, రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

● **మైలవరం:** రెడ్డిగూడెం మండలం పాతనాగులూరులో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో గ్రామస్తుల నుంచి నాలుగు అర్జీలు అందాయని తహసీల్దార్ జె. సుశీలాదేవి తెలిపారు. వీటిలో పట్టాదారు పాస్ పుస్తకాల కోసం రెండు, సర్వే కోసం రెండు 2 అర్జీలు ఉన్నాయని చెప్పారు. అనంతరం మండలంలోని రాఘవాపురం, నాగులూరు, రంగాపురం, రెడ్డిగూడెం గ్రామాలను సందర్శించారు. రైతులకు టార్పాలిన్ పట్టాలు పంపిణీ చేశారు. సర్పంచ్ కొలుసు వెంకటేశ్వరరావు, ఆర్ఐ గంధం వుల్లయ్య, వీఆర్ఓ ఎంవీ శ్రీనివాసరావు, సర్వేయర్ పాల్గొన్నారు.

ఇంధన పొదుపు అందరి బాధ్యత

నూజివీడు: ఇంధనాన్ని పొదుపు చేయడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఏపీసీపీడీసీఎల్ నూజివీడు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.సత్యనారాయణ అన్నారు. ఇంధన వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ సిబ్బంది పట్టణంలోని ఈఈ కార్యాలయం నుంచి చిన్న గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే ఇంధనాన్ని పొదుపు చేయవచ్చన్నారు. విద్యుత్ వినియోగదారులు గృహాల్లో, షాపుల్లో విద్యుత్ వాడకంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఐఎస్ఐ మార్కు ఉన్న విద్యుత్ పరికరాలనే వాడాలని, ఎక్కువ విద్యుత్‌ను ఖర్చు చేసే బల్బులకు బదులుగా ఎల్ఈడీ బల్బులను వాడాలన్నారు. డీఈలు ఓలేటి దుర్గారావు, పోతురాజు, ఏఈలు, ఎల్ఐలు, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

● **ఇబ్రహీంపట్నం:** ఎన్టీటీపీఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఇంధన వారోత్సవాలు డీఏవీ (దయానంద్ ఆంగ్లో వేదిక) పాఠశాలలో ఎస్ఈ వెంకటరావు గురువారం నిర్వహించారు. ఇంధన పొదుపు ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఇంధనాలను అతిగా ఖర్చు చేయడం వలన మొక్కలు, జంతువులు, ఇతర సహజ వనరులన్నీ దెబ్బతింటాయన్నారు. డెప్యూటీ కార్యదర్శి ఎం.సుశీల, ఎనర్జీ మేనేజర్ బి.హరి, పాఠశాల హెచ్ఎం మన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

మూలపాడు(ఇబ్రహీంపట్నం): జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ శాఖ విజయవాడ రూరల్ డివిజన్ ఆధ్వర్యంలో మూలపాడు జెడ్పీ పాఠశాల విద్యార్థులకు గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యుత్ పొదుపు అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వసంతరావు, డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేవై కొండలరావు బహుమతులు అందజేశారు. హెచ్ఎం డేవిడ్ రాక్‌ఫెల్లర్, ఏఈ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌సీఐ సౌత్ ఇండియా ఇన్‌చార్జిగా వెంకటేశ్వరరావు



మైలవరం: హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా సౌత్ ఇండియా ఇన్‌చార్జిగా రెడ్డిగూడెం మండలం రుద్రవరం గ్రామానికి చెందిన జె.వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. వెంకటేశ్వరరావు సమాజానికి చేసిన సేవలను గుర్తించి హెచ్‌ఆర్‌సీఐ వ్యవస్థాపక అధ్యక్షుడు, చైర్మన్ చెన్నుపాటి శ్రీకాంత్, నందం నరసింహారావు ఆధ్వర్యంలో ఈ నియామకం జరిగింది. వెంకటేశ్వరరావును పలువురు అభినందించారు.

నేడు రైతు దినోత్సవం

తిరువూరు: తిరువూరు భారతీయ స్టేట్ బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం రైతు దినోత్సవాన్ని నిర్వహిస్తామని చీఫ్ మేనేజర్ రవికుమార్ తెలిపారు. తిరువూరు ఆర్య వైశ్య కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, రైతులకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా అందిస్తున్న వివిధ పథకాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలకు విరాళం

తిరువూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనుల నిమిత్తం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. గురువారం ఆర్యవైశ్య ప్రముఖులు అనుమోలు ముత్తారావు, లయన్స్ క్లబ్ చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, జంగాల మురళీకృష్ణలు రూ.10 వేల చొప్పున విద్యార్థుల సైకిల్ షెడ్ నిర్మాణానికి విరాళాన్ని ప్రధానోపాధ్యాయిని శ్రీలక్ష్మికి అందజేశారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాబూరావు

గంపలగూడెం: గంపలగూడెం ఇన్‌చార్జి ఎంపీడీఓగా దాకరపు బాబూరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పనిచేసిన చెన్నయ్య సచివాలయంలో స్టేట్ ఫైనాన్స్ డిపార్టుమెంట్‌కు బదిలీ అయ్యారు. ఇక్కడ ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న డి. బాబూరావును ఉన్నతాధికారులు ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

కొమ్మిరెడ్డిపల్లి(తిరువూరురూరల్): మండలంలోని కొమ్మిరెడ్డిపల్లి ఎంపీయూపీ స్కూల్‌లో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ పండుగ విశిష్టతను, ఏసుక్రీస్తు జనన విశేషాలను ఇండిపెండెంట్ తెలుగు బాప్టిస్టు చర్చి పాస్టర్ సంజీవ్ వివరించారు. ఏసుక్రీస్తు చూపిన బాటలో అందరూ నడవాలని, సర్వమానవాళి సుఖశాంతులతో వర్థిల్లాలని చెప్పారు. పేరెంట్స్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఎంపీటీసీ నామా గోపాల్, దొడ్డా లక్ష్మణరావు, ప్రధానోపాధ్యాయుడు గిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం

ముసునూరు: క్రీస్తుమార్గాన్ని అనుసరించే వారి జీవితాలకు గొప్ప దీవెనలు లభిస్తాయని టెలివిజన్ శుభ వర్తమానికులు, జీసస్ నిస్సీ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు బ్రదర్ బి.రాజేష్‌బాబు అన్నారు. చెక్కపల్లిలోని మినిస్ట్రీస్ ప్రాంగణంలో గురువారం రాత్రి గ్రాండ్ సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. క్యాండిల్ సర్వీసుతో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

అమిత్ షా వ్యాఖ్యలపై దళిత సంఘాల ఆగ్రహం

రాజీనామా చేసి క్షమాపణ చెప్పాలని డిమాండ్

నూజివీడు: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్ సాక్షిగా ఎగతాళిగా మాట్లాడి అవమానపరిచిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాపై దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. అమిత్‌షా అహంకార పూరిత వ్యాఖ్యలను నాయకులు తీవ్రంగా ఖండించారు. వెంటనే పదవికి రాజీనామా చేసి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. కృష్ణా జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ముసునూరు జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, నూజివీడు మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, దళిత నాయకుడు పిళ్లా చరణ్ తదితరులు నూజివీడులో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అంబేడ్కర్ దేశానికి రాజ్యాంగం రచించి దిశా నిర్దేశం చేసిన మహనీయుడన్నారు. ప్రపంచ మేధావి అయిన బీఆర్ అంబేడ్కర్ పట్ల అమిత్‌షా మాట్లాడిన తీరు చూస్తుంటే బీజేపీ చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతోందని చెప్పారు. అమిత్‌షాకు రానున్న రోజుల్లో దేశ ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. దేశ వ్యాప్తంగా మహోద్యమం ప్రారంభం కాకముందే అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దళిత నాయకులు చేబత్తిన మున్నా, కంచర్ల లవకుమార్, ఉదయగిరి కృపారావు, కలపాల కృపారావు, సర్పంచి ఉదయరాజు, తొమ్మండ్రు బుజ్జి పాల్గొన్నారు.

● **కొండపల్లి(ఇబ్రహీంపట్నం):** రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు దుర్మార్గమైనవని, తక్షణం ఉపసంహరించుకోవాలని డీసీసీ కార్యదర్శి బొర్రా కిరణ్ డిమాండ్ చేశారు. కొండపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి ప్లకార్డులు పట్టుకుని గురువారం నిరసన వ్యక్తం చేశారు. కిరణ్ మాట్లాడుతూ అమిత్‌షా వ్యాఖ్యలను ప్రధాని నరేంద్రమోదీ సమర్థించడం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల మనోభావాలను దెబ్బతీయడమేనని విమర్శించారు.

మామిడి బీమా పథకం గడువు పొడిగింపు

ఇబ్రహీంపట్నం: మామిడి తోటల రైతులు బీమా చేయించుకోవాలని మండల ఉద్యానశాఖాధికారి వి.నీలిమ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మామిడి తోటలకు బీమా సదుపాయం గడువు పొడిగించిందని, ఈనెల 31వ తేదీ లోగా చెల్లించాలని సూచించారు. పూర్తి వివరాలకు ఉద్యాన శాఖాధికారి వి.నీలిమ, సెల్ 79950 86880 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

చామంతులతో సహస్ర నామార్చన

తిరువూరు: ధనుర్మాసం సందర్భంగా తిరువూరులోని పలు దేవాలయాల్లో గురువారం విశేష పూజలు నిర్వహించారు. వేంకటాచలస్వామి దేవస్థానంలో గోదాదేవికి చామంతులతో సహస్ర నామార్చన చేశారు. కోదండ రామాలయం, శ్రీరంగనాయక స్వామి దేవస్థానం, రాజుపేట ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేష పాశురం, సేవాకాలం, విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు.

● **గంపలగూడెం:** ధనుర్మాసం సందర్భంగా గంపలగూడెం, పెనుగొలను, ఊటుకూరు రామాలయాల్లో, నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. లక్ష్మీహైగ్రీవ హోమం జరిపారు. శంకు, చక్రం, నామం ఆకారంలో ప్రమిదలు ఉంచి దీపోత్సవం నిర్వహించారు. ఆయా ఆలయాల్లో తిరుప్పావై నాల్గవ పాశురం పఠనం చేశారు.